


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**నిజం ఆ సూక్తం ఇప్పుడు చెపుతుంది** -- 'అయినా, ఈ సృష్టి ఎప్పుడు జరిగిందో ఇక్కడ (అంటే బహుశా భూమ్మీద) ఎవరు చెప్పగలరు? ఆ పురుషుడే ఈ సృష్టికి కారకుడు అవునో కాదో, దాని పర్యవేక్షకుడు తాను అవునో కాదో తనకు మాత్రమే తెలుసు. తనకూ తెలియదా?' సృష్టి లయలూ, వగైరాల మీద తన అభిప్రాయాన్ని చెప్పడానికి బుద్ధుడు నిరాకరించాడు ఇలాంటి ప్రశ్నలను అడివి, ఎడారి, తోలుబొమ్మలాట, ఊహాజనితమైన విషయాలుగా అభివర్ణించాడు. బుద్ధుడికె అంతుబట్టని విషయాలవి. అవి వాదోపవాదాలకు, విచారానికి తప్ప జ్ఞానానికి శాంతికి దారితీయవని భావించాడు. 'తేజోబిందు' అనే ఉపనిషత్తు ఈ ప్రపంచ అస్తిత్వం గురించి తమాషాగా చెపుతుంది. ఈ జగత్తు నిజమైనదే అని భావించటం అంటే అది వీటితో సమానం – గొడ్రాలి కొడుకు యొక్క మాటకు భయపడటం; కుందేలు కొమ్ముతో మదగజాన్ని చంపగలడం; ఎండమావులందలి జలాన్ని గ్రోవి దప్పితం తీర్చుకోవడం; మనిషి యొక్క కొమ్ముతో ఒక జీవిని చంపగలగడం; ఆకాశంలో ఏదన్న నగరం ఉండడం; ఆకాశం నల్లగా ఉండడం; శుక్తికా రజతంతో చేసిన భూషణాన్ని ధరించడం; రజ్జు సర్పంతో కరవబడడం; బంగారు బాణంతో జ్వాలాగ్నిని నశింపజేయడం. 'మైతారుని' కూడా ఈ ప్రపంచం గురించి కవితాత్మకంగా చెబుతుంది: స్వప్నం, మాయామయం, భ్రమాపూరితం, మహాంధకారం, ఇంద్రజాలం, మిథ్యాదర్శనం, కదళీగర్భంలా నిస్సారం; చక్షురుగోచరమైన ప్రపంచమంతా సారహీనమై క్షణంలో నశించిపోతుంది. వాటిలా కఠినంగా కాక 'అవ్యక్త' అన్న ఉపనిషత్తు ఇలా అంటుంది: వ్యక్తంగానూ, అవ్యక్తంగానూ ఉన్న ఈ సర్వ ప్రపంచం మరియు చరాచరమంతయు అవ్యక్తపరబ్రహ్మ; ప్రపంచం వ్యక్తమై ఉండకపోతే మనం దానిని గమనించగలిగే స్థితిలో ఉండేవాళ్ళం కాదు; ఆ పరబ్రహ్మ ఎవరికీ వ్యక్తం కానట్లుగా బ్రహ్మ అన్నవిషయం అర్థం చేసుకోవడం కష్టం; ఏమైనా ప్రపంచం, బ్రహ్మ వేరు వేరు కారు అన్న విషయం వ్యక్తమవుతోంది. డార్విన్ తన పరిణామ

సిద్ధాంతాన్ని ఆ రోజుల్లో ప్రతిపాదించడం సాహసోపేతమైన చర్య. భూమి మీద ఉన్న జీవరాశి ఒకే పూర్వీకుడికి చెందినది అన్నాడు. ప్రతి పుట్టుకలోనూ అంతకు ముందుకన్నా వేరైనా మార్పు చోటు చేసుకుంటుంది. అంటే ఒక తరం మరో తరానికి జీన్స్ లో మార్పు వస్తుంటుంది. జీవ పరిణామం జీవితపు చరిత్రను తెలియజేస్తుంది. మనందరం సుదూరపు దాయాదులం, చెట్లు, ఇతర జీవాలతో సహా. [అంచేతే మన వాళ్ళు వసుధేవ కుటుంబం అని ఉంటారు.] ఈ జీవ పరిణామంలో బలమైన వాళ్ళు మిగిలి ఉంటుంటారు, బలహీనులు నశించిపోతుంటారు. జీవించడం కొనసాగాలంటే కష్టనష్టాలకు తట్టుకోగలిగే శక్తీ కావాలి. దేవుడు మర్కటాన్ని నేరుగా సృష్టించి ఉండటానికి వీలు లేదని డార్విన్ పరిణామవాదంతో తేలిపోయింది కదా. దాని ప్రాకారం మనిషినీ ఆయన సృష్టించలేదు. భూమి మీది సకలజీవరాశికీ ఒకే పూర్వీకుడున్నాడట. దాని నుంచి అనేక జాతులు, జీవాలు పరిణామక్రమంలో ఆవిర్భవించాయని ఆయన తేల్చాడు. మనిషి ఉద్భవించిన జాతి, మర్కటం ఆ కోవవే. జెన్యు సంబంధమైన జాతులు ప్రతి తరంలోనూ మారుతుంటాయి. ఆత్మా అంటూ ఉంటే దాన్నిమనిషి ఏ అవస్థలో ఉన్నపుడు మనిషిలోకి ప్రవేశించిందో తెలియదు. ఆదిలో విస్ఫోటన ద్వారా ప్రపంచం ఏర్పడిందని శాస్త్రజ్ఞులు భావిస్తారు, సరే నేను వాటన్నింటిలోకి వెళ్ళవలసిన అవసరం, వ్యవధి లేవు. మీకు నేను చెపుతున్న విషయాల పరిజ్ఞానం లేదని భావించి మీకు చెప్ప ప్రయత్నం చెయ్యడం అహంకార చర్య అవుతుంది. చచ్చే వాడికి అహంకారంతో ఏం పని. చావబోయే ముందు కూడా అది చావదని నాకు, మీకు తెలుసు…"

అతని మాటల ప్రవాహానికి చిన్న అడ్డుకట్ట వేయదలిచాడు అనంతం. అతనికి దేవుడు చెపుతున్న ఏ అంశం మీద ఆసక్తి లేదు. యాంత్రికంగా వింటున్నాడు.

"ఇది అనంత ప్రపంచం; నీ శరీర, మెదడు పరిమాణాలతో దానిని భౌతికంగా, ఊహాత్మకంగా అంచనా వేయడానికి వీలవనిది. ఏమంటావు?"

"అందులో రెండభిప్రాయాలకు తావేది? అతి స్వల్పంగానైనా సాధ్యమే అనడానికి సాహసిస్తున్నాను."

"సృష్టి ఏర్పడిన లక్షలకోట్ల సంవత్సరాలైనా ఏ మేరకు, ఎంత సరిగ్గా అంచనా వేయగలిగాము? అహంకారం కారణంగా అసాధ్యమైన పనికి పూనుకుంటాం. అలాంటి, నలుసునుకు నలుసు, అణువుకు అణువువి అయిన తమరు సృష్టి గురించి, అంచనాకు మించిన ప్రపంచం గురించి శోధించడానికి పూనుకోవడం అహంకారపూరితం కాదా?"

"ఆ పని చేస్తున్నది ఉత్సుకత వల్ల, అహంకారంవల్ల కాదు, అన్నయ్యా. అణువులో కనీసం ఈ భూగోళాన్ని ధ్వంసం చేయగల శక్తి లేదు? అంచనాలకు పూనుకోవడం అహంకారానికి సంబంధించిన విషయమే కానీ మరోటి కాదు అనుకోవడం అంత సబబు కాదు. నేను అహంకారం కారణంగా ఆ పని చేయపూనుకోలేదని నాకు తెలుసు. అయినా ఆ అంచనాలతో సృష్టి రహస్యాలు ఛేదించదలుచుకోలేదు, నా కన్నా సమర్థులు తెలియజేసిన విషయాలను వల్లెవేస్తున్నా. చచ్చే వాడికి అవన్నీ అవసరమా, అని మీరు అనకండి. అనవసరం కూడా కాదు. తద్వారా సంబరమూ ఆశ్చర్యమూ కలుగుతాయి – ఒక సర్కసును చూసేటప్పటిలా; ఒక జలపాతాన్నో, చుక్కలతో కూడిన ఆకాశాన్నో, వెన్నెలనో, కురిసిన

వర్షాన్నో, పామునో, ఎండనో, చూసే టప్పుడు మనసు పొందే అనుభూతి – ఎవరికీ అడ్డరానిది. మరొక విషయం – ఈ సువిశాల సృష్టిలో నలుసుకే నలుసుగా జీవించడం నిజానికి అప్పుడప్పుడు సిగ్గువెయ్యకపోదు. సిగ్గు అహంకారపు ఒక కొమ్మ. అయితే ఇలాంటి నలుసుకే నలుసైన మనిషిని లేక మరో జీవిని సృష్టించడానికి సృష్టికే సిగ్గులేనప్పుడు మనం సిగ్గు పడడం అనవసరం. జీవించడం అక్కర్లేదనుకుంటే మరణించడం అనే ప్రత్యామ్నాయం మనకే వదిలివేయబడింది. అది ఒక గొప్ప స్వేచ్ఛ, కరుణించి ఇచ్చిన వరం."

"నీలో ఉన్మాదం నిండుగా, మెండుగా ఉందని చాలా సేపటి క్రితమే గుర్తించాను. ప్రతి విషయాన్నీ నీ చావుకు ముడి పెడుతుంటుంది నీ మనసు. నీవు మానసిక వైద్యశాలకు వెళ్లే ప్రయత్నం ఏనాడైనా చేశావా?"

"అది మానసిక రుగ్మతగా నేను భావించినప్పుడు కదా ఆ ప్రయత్నం చెయ్యాలి? వెళ్ళి వాళ్లకు నేను నా వ్యాధి లక్షణాలు ఇవి అని చెప్పడానికి అవి ఏవో నాకే తట్టాలిగా. నేను రోగ లక్షణాలుగా భావించి చెపితే నన్ను పిచ్చివాడిగా కాక మేధావిగా వాళ్ళు భావిస్తారేమో. నా లక్షణాలు నన్ను బాధించనప్పుడు వాటిని నిర్మూలించుకునే ప్రయత్నం ఎలా చెయ్యాలి? కారణాలు నాలో లేవు; బైట ఉన్నాయి."

"సరే నీ మురికిని నువ్వు ప్రేమిస్తానంటే కాదనరెవరు; అంటురోగంలా అవి ప్రక్కవాడిని సోకనంతవరకు."

"ముండకోపనిషత్తులో కర్తను సాలిపురుగుతోనూ, సృష్టిని దాని గూడుతోనూ పోల్చారు. ఒక సాలిపురుగు తనలోని పదార్థంతో తన గూడును విస్తరించినట్లు; బ్రతికి ఉన్న మనిషి తలలో నుంచి జుట్టు పొడుచుకుని వస్తూ ఉండేట్లు, నాశనం లేని బ్రహ్మ నుంచి ఈ సృష్టి జరుగుతోందని అన్నారు. సృష్టిలో మనము భాగమే కాక బ్రహ్మయే మనం అయివున్నాం. గర్వ పడవలసిన విషయమే. ప్రతి జీవిలోనూ మనల్ని చూసుకోమంది ఉపనిషత్తు; మనలో ప్రతి జీవిని చూసుకోమంది. ఓర్పు, పాండిత్యం, ఉండవలసిన బ్రాహ్మడిలోనూ, ఆవులోనూ, ఏనుగులోనూ, కుక్కలోనూ, కుక్కమాముసం తినే మనిషిలో కూడా సృష్టికర్త ఆత్మా రూపంలో ఉంటాడట. సృష్టికర్త సర్వాంతర్యామి; సృష్టిని సృష్టికర్త నుంచి వేరు చేసి చూసే వీలే లేదు. ఈ విషయం వదిలేద్దాం."

"అసలు 'సృష్టి' అన్న సంస్కృత పద అర్థం లేనిదాన్ని కొత్తగా పుట్టించడంగా భావించడమే తప్పు అంటాడు వివేకానంద. సృష్టి అన్నదాన్ని ఆంగ్లంలో చెప్పాలంటే 'ప్రొజెక్షన్' అనాలి. అంటే తిరిగి ఉద్భవించడం. ఒక కల్పం పూర్తి అవగానే ప్రతిదీ మెత్తటి పదార్థంగా మారిపోయి ఆ ఆది పదార్థం నుంచీ ఏది ఆవిర్భవించిందో దానిగా మారిపోతుంది. ఆ స్థితి కొంత కాలం అలాగే ఉండిపోయి మరో కల్పం ఆరంభమవుతుంది. ప్రకంపన మొదలయి ప్రాణ శక్తి కదలిక లేనంతగా అవుతుంది. నిజానికి అది 'ఆనిదావారం' అనే స్థితిలో ఉంటుంది; అంటే కదిలీ కదలకుండా ఉండటం. ప్రాణశక్తి కారణంగా ఆకాశం కదలిక కలిగి ఉంటుంది. ఆ కల్ప ఆరంభం దగ్గరపడే కొలదీ కదలికలు అధికమవుతాయి. ఆకాశం కెరటాలుగా మారిపోతుంది––అదే సూర్యగోళాలు, చంద్ర గోళాలు, మిగతా వ్యవస్థలూ.

మండూకోపనిషత్తు ప్రకారం సృష్టి దేవుడి మహత్తర మానవాతీత శక్తి [విభూతి} ప్రదర్శనగా కొందరు సృష్టి చింతకులు మరి కొందరు దాన్ని కలగా, ఇంద్రజాలంగా భావిస్తారు. సృష్టి భోగార్థం, క్రీడార్థం జరుగుతుందని కొందరు భావిస్తారు. కానీ బ్రహ్మ కోర్కె లేనివాడు కనుక ఆయన స్వభావానికి అనుగుణంగానే జరుగుతుంది అన్నారు.

"బ్రహ్మానందం!"

"పిల్లుల కథలు రెండు చెపుతాను. కాలక్షేపానికి కాదు అవి వినిపించడం అని నేను అనలేను. నేను చెబుతున్న ప్రతి విషయం కాలక్షేపానికే అని కాలక్షేపానికి కాదు అని కూడా అనొచ్చు. నిజానికి చెబుతున్నదంతా ఒక వేదనగా అసహాయ స్థితిలో వెళ్లబోసుకుంటున్న అక్కసుగా నీవు భావించగలిగితే అదేం తప్పు కాదు. నిజానికి ఈ సృష్టిలో అంతా ఒప్పే, తప్పుకు స్థానం లేదు. నిజానికి ఒక కలలో చేసే హత్య తప్పేలా అవుతుంది? చేసే త్యాగంలోకూడా ఒప్పుండదు."

"ఆ కథలు త్వరగా వినిపించేసి నీవు నీకు పాడాలనుకున్న భరత వాక్యం పలికేసుకో. మంచితనం అనే ముసుకేసుకోకుండా నీవు నిజాయతీగా నీ నైజాన్ని నగ్నంగా ప్రదర్శిస్తుండడం నాలో నీ పట్ల గౌరవాన్ని రగిల్చింది. వెచ్చదనం శరీరమంతా సోకి ఒక సుఖాన్ని ఇస్తోంది. ఎంత అద్భుతమైన సృష్టి – నువ్వు, నేను, ఆకాశం, గాలి, చుక్కలు,.."

"చీకటిలో ఉన్నవాడు అది ఇబ్బందిపెట్టకుండా ఉంటె వెలుతురు గురించి వెంపర్లాడవలసిన పని లేదు. చీకటి నుంచీ నన్ను వెలుతురిలోకి ప్రవేశ పెట్టూ అని ప్రార్థించనక్కర లేదు. అలాగే అజ్ఞానాన్ని ఆనందించగలుగుతున్నపుడు జ్ఞానం గురించీ తపన పడవలసిన పని లేదు. నేను అజ్ఞానిని అన్న జ్ఞానం నాకు కలగడం వలనను అది ఇబ్బందికరంగా తోచడమే కాక కొత్త విషయాలను తెలుసుకోవాలన్న జిజ్ఞాస తీటలా బాధించడం వలన నేను నాకు సాధ్యమైన పరిశోధన ఒకటి చేశాను. ఆ క్రమంలో పిల్లులకు సంబంధించిన విషాద గాథలు రెండు తారసపడ్డాయి. వాటివలన నా జ్ఞానం వికసించడం అటుంచి నా అజ్ఞాన పరిమాణం అధికమయింది, రహస్యాలు మరింత అభేద్యంగా తోచాయి. చాలా కాలం క్రితం ఒక రోజున నా వసతి గృహానికి రెండు పిల్లిపిల్లలు వచ్చాయి; ఆకాశపు కన్నాలనుంచీ ఊడిపడ్డట్టు, ఎవరో కావాలని పంపినట్ల, చుట్టపు చూపుగా అరుదెంచినట్టు, బ్రతుకు తెరువును వెదుక్కుంటూ వచ్చినట్లు, నారు వేసినవాడు నీరు నీవే వెదుక్కో అని ఆదేశించినట్లు. పెన్సిలు గీతల రంగు, చిన్ని చిన్ని ఆకారాలు, సంగీతపు అరుపులు – ఎదో విన్నవించుకుంటున్నట్లు, ఆక్రోశం మర్యాదగా వెళ్లబోసుముకుంటున్నట్లు, తమ దుస్థితికి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నట్లు. ఇంటిలో నుంచీ ఎన్ని సార్లు తరిమితే అన్ని సార్లూ అవి తిరిగి వచ్చాయి. అక్కడ ఉండే తమ హక్కును చాటుకుంటున్నట్టు. నా పేద కొంప వాటికి నచ్చినట్లుంది. కలో గంజో దొరికితే చాలునని భావించి ఉండవచ్చు. బతికామా లేదా అన్నది ముఖ్యమైన విషయం గాని ఎలా బ్రతకామో అన్నది కాదు. పాలే కాదు, గంజి ప్రాణం నిలబెట్టగలదు."

"గడ్డి కూడా ప్రాణం నిలబెట్ట గలదు. తిండి దొరక్కబోతే మరణించడం మేలు కానీ గడ్డైనా తిని బ్రతకాలనుకోవడం ఏమి గౌరవం?"

"భారతంలో విశ్వామిత్రుడు, కరువు కాలాన ఏ తిండీ దొరక్కా కిరాతకుడు నివారించ బోయినా కుక్క మాంసం తిని ప్రాణం నిలబెట్టుకున్నాడు. తన పితరులకుకూడా అర్పించాడు బ్రతికి ఉండడం న్యాయంగా భావించడం వలన."

"కుక్క మాంసం కూడా దొరక్కపోతే సాటి మనిషినైనా చంపి, తిని ప్రాణం నిలబెట్టుకోవాలేమో!"

"పరిస్థితి విషమించినపుడు నీవు చెప్పినది అనివార్యం. ధర్మం అడ్డుపడదు. అది పరిస్థితులకు లోబడి ఉంటుంది."

"బాగా చెప్పావు ధర్మ శాస్త్రం స్వయానా వ్రాసినట్టు. అది మనిషి ఏర్పాటు చేసుకున్న కీలుబొమ్మ. అలాంటప్పుడు అధర్మం, పాపం ఉండకూడదేమో కదా?"

"అవి నాకు సంబంధించినంత వరకూ లేవు అని నమ్ముతాను. నీకు సంబంధించినంత వరకూ నా దగ్గిర ఒక సమాధానం ఉంది," అనంతం అన్నాడు,

"అభ్యంతరం లేక పోతే వెల్లడిస్తావా, అన్నయ్యా?"

"ప్రతికూల పరిస్థితులు లేనపుడు ధర్మాన్ని అతిక్రమించడం అధర్మం "

"అన్నయ్య కూడా ఒక ధర్మ శాస్త్రం వ్రాశాడేమో అనిపిస్తోంది," అని కిచకిచ నవ్వాడు, పక్షి పదే పదే వెనువెంటనే అరిచినట్టు.

"పిల్లుల కథను క్లుప్తీకరించి చెప్పు."

"నాలో ఆర్ద్రత ఎక్కువ. కరుణాత్మకమైన అంశాలను మనసు ఒదిలి రాదు. భోజన సమయానికి అవి వచ్చేవి; నాకు కలిగిన కలో గంజో పెట్టే వాడిని. దాన్నే పంచ భక్ష్య పరమాన్నంగా నాకేవి. ఎంతటి అల్ప సంతోషులూ! ఒక ఎలుక చాలు వాటిని పరమానందభరితం చేయడానికి. నాలాంటి వాడి దగ్గిర తిండిని వెదుక్కో వలసిన జీవికి, పిల్లి లాంటి మరో జీవి ఆకలిని తీర్చగల శక్తి ఉండటం వింతైన విషయమే. కాదంటావా? అనలేవనుకుంటా? ఒక పిల్లి రావడం మానేసింది నా మీద ఆధారపడ దలచుకోకనేమో. రెండవది మాత్రం హాజరు వేసుకునేది. ఇల్లు వదలని ఆడ పిల్లికి యుక్త వయసు వచ్చినట్టుంది. ఎక్కడి నుంచి పసిగట్టిందో ఒక గండు పిల్లి దాని చుట్టూ తిరుగుతోంది. బ్రతిమిలాడుకుంటూ, భయపెడుతూ, ఏడుస్తూ. మనిషైనా, పశువైనా కోర్కెకు బానిస. కొన్ని రోజులు ఆ రెండు పిల్లులూ కనుమరుగయ్యాయి. నెలల తరువాత ఆడ పిల్లి గండు పిల్లిని కరుణించినట్టు అర్థమయింది దాని పొట్ట చూస్తే. మరికొన్ని రోజులకు, ఒక దాని తరువాత మరొక పిల్లని పెద్ద పిల్లి నోటితో పట్టుకుని వచ్చి ఇంటి వరండాలో పురిటి మంచం వేసింది. గండుపిల్లి ఐపు లేదు. మరో ఆడపిల్ల వేటలో నిమగ్నమై ఉందేమో కొంత కాలం పాటు. మార్జాల న్యాయం. పిల్లిగా పుట్టక తప్పనప్పుడు అవకాశం ఉంటె మగ పిల్లిగా పుట్టాలి. మగ పిల్లి దానికి కావలసిన సౌఖ్యం అంది పుచ్చుకుని ఆడ పిల్లి చావుకి ఆడపిల్లిని కొంత కాలం ఒదిలేయ వచ్చు. అది ఆ జాతి ధర్మం; 'పాపం' అని పిలవబడేది అంటదు. పాపపుణ్యాల ఎరుక కూడా వాటికి ఉండదు. పశుపక్ష్యాదులకు పాపపుణ్యాదుల ధర్మం వర్తించకపోతే మరుజన్మలో మనిషిగా పుట్టినపుడు కర్మ అనుభవించడంలో కాస్త వెసులుబాటు ఉంటుందేమో దేవుడికి తెలియాలి; ఏ జన్మ జ్ఞాపకం ఆ జన్మతో అంతమవుతుంది.

పశు జన్మకు ముందు మనిషై ఉండుంటే ఆ జన్మ పాప ఫలితం పశు జన్మలో అనుభవించక తప్పదు. ఆ పశు జన్మలో పాప ఫలితాలన్నీ అనుభవించడం పూర్తయిపోతే కైవల్యం సిద్ధిస్తుందా? ఎవరికి తెలుసు? ఆడపిల్లికి తన బిడ్డలతోటి ఏర్పరచబడిన అనుబంధం, అనురాగం శాపాలై నానా యాతన పడింది. తన తిండీ వెదుక్కోవాలీ, కుక్కల పాలవకుండా తన భద్రతను తాను ఏర్పరచుకోవాలి; పిల్లల సంక్షేమం, రక్షణ భద్యత బరువులను మోయాలి. పశువులలో కూడా ఆడా మగల మధ్య ఎంతటి వివక్షతా! ఈ పిల్లి మగ పిల్లికి సుఖాన్నిచ్చి, బదులుగా సుఖాన్ని పొందిన పాపానికి శిక్ష అనుభవిస్తోంది – కాకపోతే దానిని శిక్షగా అది భావించడంలేదు. సృష్టికి రెండు పిల్లులూ దోహదం చేస్తున్నాయి. వాటికి కుటుంబ వ్యవస్థ లేదు. అది ఒక వరమే నేమో నాకు తెలియదు. పిల్లిపిల్లలు తల్లి పక్కగా పడుకుని తాదాత్మ్యతతో కళ్ళు మూసుకుని పాలు చప్పరిస్తూ బుల్లిబుల్లి బాయిలను పీకిపెట్టేవి. ఏదో దివ్యానందాన్ని అవి ఇస్తున్నట్టు నాలుక చాపి వాటి ఒళ్ళంతా నాకేది. పిల్లలు కాస్త పెద్దవయ్యి గునగునా నడుస్తున్నాయి. అతి త్వరగా ముగిసే జీవితం పిల్లిది; కలకాలం కాకిలా జీవించదు. ఈ రెండు జీవుల జేవితాలలోనూ వివక్షత. జన్మ ఎత్తబోయేముందు ఒకవేళ జన్మలను ప్రసాదించే శక్తి కాకివవుతావా, పిల్లివవుతావా అని కరుణించి అడిగితె ఏది కోరుకోవచ్చు? ఒక రోజు ఏడుపులాంటి అరుపులతో మూలుగులతో ఆ పిల్లి అంతటా వెతుకుతోంది; సత్యాన్వేషణ కాదు. కష్టాలు ప్రతి జీవినీ బాధిస్తాయి. మనకు మాట్లాడే నోరుంది కాబట్టి నలుగురికి చెప్పుకోడమేగాక, ఎలుగెత్తి ఏడుస్తాము హృదయం తేలిక పడటానికే కాక, ఏడవకుండా ఉండలేక. ఏమిటీ నీ కష్టం అని అడిగాను. చెప్పడానికి దానికి నోరు లేకపోయినా అడగడానికి, అరవడానికి అది ఉంది కనుక – సమాధానం రాదనీ తెలిసీ దేవుణ్ణి ప్రశ్నించినట్టూ. వెదికి, దానికి కావలసినది కనబడక వెళ్ళిపోయింది; మౌనంగా ఎవరినో శపిస్తూ. పిల్లి శాపాలకు ఉట్టి కూడా తెగదు. బహుశా ఎవరి ఏడుపు వెనుక వాళ్ళ కర్మ దాగుంటుంది కనుక కోట్ల కొద్దీ జీవాలు అడిగే కోటి కోట్ల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ కూర్చోదు వాటి సృష్టికర్త (ఒకడంటూ ఉంటే), లేక నిలుచోడు. అసలు నీవే ఆ బ్రహ్మ అయినపుడు నిన్ను నీవు ప్రశ్నించ రాదు. పొరబాటున ప్రశ్నించినా సమాధానాన్ని ఆశించరాదు. ఆరోజు సాయంకాలం పక్కింటి కుర్రాడు చావు కబురు చల్లగా చెప్పాడు నాకు అంత చల్లగా చెప్పక్కర లేకపోయినా, చచ్చింది పిల్లి పిల్లే గనుక అతి భయంకరంగా అన్యాయంగా అది చచ్చిపడున్నా– 'మీ పిల్లిపిల్ల మీ ఇంటి ప్రహరీ గోడకు ఆవల కుక్కలు విస్తరిలా చింపగా పడిఉంది.' కుళ్ళి కంపుకొట్టే ప్రమాదం ఉందని దాని చావు వలన మనకు కలిగే ఇబ్బంది మీద మనసు పెట్టాలిగావున గోడ దూకి గొయ్యి తీసి దాంట్లో దాని పూడ్చిపెట్టాను. జాత్యాహంకారం, జాతి ద్వేషం అనేవి సహజ లక్షణాలు. కుక్కలు గుంపులుగా మా వీధిలో స్వైర విహారం చేస్తూ పిల్లి జాతిని మట్టుబెట్టడం వాటికి సహజ క్రీడగా మారిపోయింది. అవి చంపుతున్నది పిల్లులనే కనుక, మా జోలికి రాకపోవడం వలన – పైగా మనిషి తారసపడితే తోకా నాలుకా ఆడిస్తూ కాలో చెయ్యో ఆప్యాయంగా నాకుతుండటం వలన వాటి విహారానికి మేము అడ్డుచెప్పే వాళ్ళం కాదు; పుర పాలక సంఘం వారికి ఫిర్యాదు చెయ్యాలని లేదు. కుక్కలకు పిల్లులంటే అంతగా పగ ఎందుకు? అని కుక్కలను అడిగినా – ఒక వేళ అవి చెప్పగలిగి ఉన్నా– సహేతుకమైన సమాధానం ఉండదు. పిల్లుల

మాంసాన్ని కుక్కలూ తినవు; చంపి ఊరుకుంటాయి, అలా చంపడాన్ని ఒక భాద్యతగా నిర్వర్తించి కర్మ అనే వ్యవస్థ నడవడానికి దోహదం చేస్తున్నట్టు. జాతిద్వేషానికి వివిధ కారణాలు ఉండవచ్చు. ఒక జాతి మరొక జాతి బలహీనత కారణంగా చులకన భావంతో తొక్కిపెట్టాలని భావించ వచ్చు. ఏ విషయంలోనైనా ఒక జాతి మరొక జాతితో పోటీ పడుతున్నప్పుడు రెండింటి మధ్యా ద్వేషం ఉండొచ్చు. కుక్కకు పిల్లంటే (దాని బలహీనత కారణంగా) చులకన భావం తద్వారా ద్వేషం ఉండుంటుంది. మనకు చాలా పెద్ద విషయాలే కాక అతి చిన్న విషయాలు కూడా తెలియక మనలను కించపరుస్తుంటాయి. తల్లి పిల్లిని పట్టుకుని గోడ అవతల మరణించిన దాని పిల్లలను చూపించి సత్యాన్ని దానికి తెలియజేయడమా, ఆ సత్యం కలిగించే బాధ దానికి కలుగనీయకుండా ఉండటానికి ఆ పని చేయకుండా ఉండటమా? తన పిల్ల చచ్చింది అన్న సత్యం తెలియక పోవడం వలన ఎక్కడో బతికి ఉండక పోదు అన్న ఆశ దానికి ఉండక పోదు. ఆశ బ్రతుకుకు ఒక ఇంధనం. కాలం గడిచే కొలదీ పిల్లలను కోల్పోయే అనుభవం మళ్ళీ మళ్ళీ పిల్లికి కలుగుతూ ఒచ్చింది. ఐనా బ్రతుకు మీద విరక్తి కలిగి గండు పిల్లితో కలవడం మాన లేదు, పిల్లలను మోయడం, కనడం మానలేదు, వాటిని అది కోల్పోవడం ఆగలేదు; వేదన తప్పడం లేదు. ఆలోచించగలిగే బుద్ధి తెచ్చుకుని జీవించడం లేదు కదా మనుషులం! ఆలోచన ఆనందాన్ని, విచారాన్ని ఇస్తుంది. ఆలోచించకుండా ఉండటం సాధ్యం కాదు. మనసు మనసును అరికట్టలేదు. అరికట్టలేని మనసును ఇచ్చి దాన్ని ఆరికట్టు అని దేవుడు శాసించి ఉంటాడని నాకు అనిపించదు. నేను చూసిన దృశ్యం, అనుభవించిన ఆవేదన నేను ఈ జన్మలోనో గతజన్మలోనో నేను చేసిన ఏ పాపపు పనికి శిక్షో నాకు తెలియదు. వివరాలు తెలియడం వలన కలిగే సుఖం ఏమీ లేదు, చేసిన తప్పుకు శిక్ష పడటం జరగదు, లేక జరుగుతుంది అనడానికి నా దగ్గిర రుజువులు లేవు. అందుచేత ప్రశ్నలు సంధించడం, అనుమానాలను వ్యక్తం చేయడం – నేను చేయగలిగిన ఈ పనులు – నేను చేస్తాను. అది అరణ్య రోదన. ఊళ్ళో జనాన్ని పోగేసి ఏడ్చినా సమాధానాన్ని ఎవరూ ఇవ్వలేరు. మన పిల్లి తిరిగి చూటిది అయింది. రెండు పిల్లలను పెట్టి అనాథ శరణాలయంలో నేనున్న గదిలో దాచింది అతి విలువైన వస్తువులా; దానికి అవి విలువైనవి. అతి విలువైనదిగా మనం భావించే డబ్బు దానికి వాసన చూడడానికి కూడా అనర్హమైనదే. రెండు మూడు రోజులు మాత్రమే దానికి పాలిచ్చింది. ఏ రోగం సోకిందో ఉన్నట్టుండి రోడ్డు మీద కూలిపోయింది. ప్రాణం పూర్తిగా పోలేదు. ఇసుకలో అలలా ఇంకిపోతోంది దాని ప్రాణం. పోయే ప్రాణం తన రూపాన్ని పిల్లి కళ్ళల్లో ప్రతిబింబిస్తోంది. దాన్ని తెచ్చి మెట్ల క్రింద ఉంచి పాల చుక్కలు నోట్లో పోశాను, నాలుక కదిలించింది గాని దాన్ని చప్పరిద్దామన్న కోర్కె ఉన్నట్టు లేదు. మరో కోర్కె మాత్రం భయంకరంగా నా గుండెను పిండుతూ దానిలో కనబడింది. కూలిపోయి నిలబడటానికి వీలు ఇవ్వని శరీరాన్ని అది లాగుకుంటూ కాస్త దూరం చేరింది. అది ఎటు వెళ్లే ప్రయత్నం చేస్తోందో నాకు తెలిసిపోయింది నిర్ద్వంద్వముగా. తన పిల్లలున్న దిక్కుకి శరీరాన్ని లాగే ప్రయత్నం అతి తీవ్రంగా చేస్తోంది. వాటిని చేరాలని, వాటికి ఏదో సమకూర్చాలని తపన దాన్ని హింసిస్తోంది పావు గంటలో, కదిలి వెళ్లే అనేక ప్రయత్నాలు చేసి మరికొంత దూరం వెళ్ళింది; అక్కడ ప్రాణం వదిలింది. 'నా పిల్లలకు నేను అన్యాయం చేసి పోతున్నానే' అన్న బాధకు

ఎలాంటి భౌతిక రూపం ఇవ్వగలం? ఆ అన్యాయానికి ఎవరిని పిల్లి నిందించాలి? తన పుట్టుకకు కారణమైన తల్లి పిల్లి, తండ్రి పిల్లులనా లేక పిల్లి జాతిని సృష్టించిన 'నిందకు అందని' శక్తినా? దాన్ని గోడ అవతలికి తీసుకు పోయి గొయ్యి తవ్వి కప్పేశాను. పిల్లిపిల్లలను ఇరవై రోజులు ఫిల్లరు ద్వారా పాల చుక్కలను వాటి నోటిలో పోసి పెంచాను. ఒక దాని తరువాత ఒకటి రెండు కూనలూ చచ్చాయి. తీసుకెళ్లి వాటి తల్లి పక్కన పూడ్చిపెట్టాను. అలా పాలు పోసి నెలరోజులపాటు అవి చావకుండా ఉంచడమూ పాపమేనేమో. నేను దాని ఫలితాన్ని అనుభవించక తప్పదేమో! ఎవరు చెప్పగలరూ?"

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS